07-04-2025
సోమవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM


ప్రభాత **జయభేరి**

తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

సంపుటి : 02 | సంచిక : 197 | పేజీలు : 8 | వెల : 4

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి







# రాములోరి కల్యాణం కమనీయం



భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం

పల్లె పల్లెన.. పెళ్లి సందడి... సీతారాముల కళ్యాణ వైభోగం

ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం దంపతులు

నేడు శ్రీరామ మహాపట్టాభిషేకం వస్త్రాలు సమర్పించనున్న గవర్నర్

**జయభేరి, భద్రాచలం, ఏప్రిల్ 6:** భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. రామ నామ జపంతో భక్తులు పరవశించిపోతుండగా.. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకే స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళాశాసనం, అభిషేకం చేశారు. తదుపరి ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ పాల్గొన్నారు. ఉదయం 9.45 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఊరేగింపుగా మిథిలా స్టేడియంలోని కల్యాణ మండపానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. స్వర్ణ సింహాసనంపై స్వామివారిని, అమ్మవారిని ఆసీనులను చేశారు. కళ్యాణం సందర్భంగా భక్తరామదాసు చేయించిన నగలను వధూవరులకు ధరింపజేశారు.
తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి సతీసమేతంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీత ఉదయం 11.33 గంటలకు రామాలయానికి చేరుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. పూజల తర్వాత సీఎం దంపతులు 11.45 గంటలకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. అక్కడ జీలకర్రబెల్లం సమయంలో పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రామయ్యకు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం సమీపించగానే వేద పండితులు ఉత్సవ మూర్తుల శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. అనంతరం మూడు సూత్రాలతో కన్నుల పండువగా

...మిగతాది 2 లో



# భారత ఇంజనీరింగ్ వండర్

2 లో

# నక్సల్స్ శాంతి మంత్రం

3 లో

# దేశంలోనే రెండో స్థానం

## వృద్ధి రేటులో పురోగతి సాధించిన ఆంధ్రప్రదేశ్



**జయభేరి, అమరావతి :** స్పష్టమైన ప్రణాళికలతో ఏపీ అభివృద్ధిని పరుగులు పెట్టించాలని భావిస్తున్న సీఎం చంద్రబాబు.. ఆ దిశగా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. గతంలో వృద్ధి రేటులో వెనుకబడ్డ ఆంధ్రప్రదేశ్.. ఇప్పుడు ఎన్నో స్థానాలు ఎగబాకింది. కేంద్రం విడుదల చేసిన జాబితాలో 8.21 వృద్ధి రేటుతో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో 9.18 శాతం వృద్ధి రేటుతో ఏపీ కంటే ముందు వరుసలో తమిళనాడు నిలిచింది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏపీ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. 15 శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చంద్రబాబు చాలా సందర్భాల్లో స్పష్టం చేశారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ అగ్రగామి దేశంగా

...మిగతాది 2 లో



# పేదవాడి కంచంలో సన్నబియ్యం

# స్వయంగా రుచి చూశా

**జయభేరి, భద్రాచలం, ఏప్రిల్ 6:** రాష్ట్రంలోని ప్రతి నిరుపేద సన్నబియ్యంతో అన్నం తినాలన్న లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిన నేపథ్యంలో ఒక లబ్దిదారుడి ఇంట్లో ఆ కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా సహపంక్తి భోజనం చేశారు.
భద్రాచలం శ్రీ సీతారామ స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న అనంతరం బూర్గంపాడు మండలం సారపాకలో సన్నబియ్యం లబ్దిదారుడు బూరం శ్రీనివాస్ ఇంట్లో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి లబ్ధిదారుడి కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ కుటుంబ సభ్యురాలు తులసమ్మను వివరాలు అడిగారు. దొడ్డు బియ్యం పంపిణీ చేసినపుడు అసలు వాటిని తీసుకునేందుకే ఆసక్తి చూపేవాళ్లం కాదని చెప్పిన తులసమ్మ, ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వడంతో కుటుంబానికి ఉపయోగంగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు.
200 యూనిట్స్ వరకు ఉచిత కరెంట్, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అందుతున్నాయా అని సంక్షేమ పథకాల గురించి ముఖ్యమంత్రి వారి నుంచి ఆరా తీశారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల తమకు ఎంతో ఉపయోగపడుతుందని తులసమ్మ ఆనందం వ్యక్తం చేశారు.

# కొత్తగా 16 నేషనల్ హైవేలు

## భూసేకరణ పూర్తి చేయాలంటూ సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ



**జయభేరి, హైదరాబాద్ :** తెలంగాణ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ముఖ్యంగా జాతీయ రహదారుల విస్తరణ, అభివృద్ధి వేగవంతం చేయాలని భావిస్తున్నాయి. ఇప్పటికే అనేక కొత్త రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టాయి. మరికొన్ని రహదారుల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం విషయంలో కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం కోసం భూసేకరణ

...మిగతాది 2 లో

# పర్యావరణాన్ని రక్షిద్దాం

## HCU భూవివాదంపై కేటీఆర్ బహిరంగ లేఖ



2 లో

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని రక్షించేందుకు అందరూ ఐక్యంగా నిలబడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తాను ఓ రాజకీయ నాయకుడిగా కాకుండా సాధారణ పౌరుడిగా, ప్రకృతి ప్రేమికుడిగా అటవీ భూములతో పాటు వన్య ప్రాణులను సంరక్షించుకునేందుకు పోరాటం కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో రాసుకొచ్చారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ముందుకొచ్చిన విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు, మేధావులు, జర్నలిస్టులకు తాను కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. 400 ఎకరాల పచ్చదనాన్ని కాపాడటానికి పోరాడదామని... కంచ గచ్చిబౌలిలోని భూములు 734 జాతుల మొక్కలు, 220 జాతుల పక్షులు, 15 జాతుల సరీసృపాలు, 10 జాతుల క్షీరదాలకు జీవనాధారం అని ఆయన రాసుకొచ్చారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## రాములోరి కల్యాణం కమనీయం

మాంగళ్య ధారణ నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి తిలకించారు. అదేవిధంగా హైకోర్టు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. టీటీడీ తరఫున చైర్మన్ బీఆర్ నాయుడు శ్రీసీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పించారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించడానికి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండ తీవ్రతను తాళలేక అవస్థలు పడ్డారు. కల్యాణ మండపానికి చేరుకునే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేయడంతో భక్తులు ఇక్కట్ల పాలయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే సమయంలో గంటపాటు సామాన్య భక్తులకు స్వామి వారి దర్శనాన్ని నిలిపివేశారు. ఒక మహిళా ఎస్సై అత్యుత్సాహం ప్రదర్శించారు. నిఘా వర్గాల సిబ్బందిని సైతం వెళ్లిపోవాలని హుకుం జారీ చేయడం గమనార్హం. ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సీఎం రాకను చిత్రీకరించేందుకు ప్రయత్నించగా వారినీ ఆ ఎస్సై వెళ్లిపోవాలని హెచ్చరించారు. తమకు పాస్‌లు ఉన్నాయని చెప్పినా వినిపించుకోలేదు. చివరిలో కల్యాణ తలంబ్రాల కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. కల్యాణం అనంతరం ఒక్క రామయ్యకు మాత్రమే నిర్వహించే విలక్షణ ఉత్సవం మహాపట్టాభిషేకం. ఏటా శ్రీరామ నవమి మరుసటి రోజు జరిగే ఉత్సవాన్ని శ్రీరామ మహాపట్టాభిషేకంగా పేర్కొంటారు. ఇందులో భాగంగా శ్రీరాముడికి ఆభరణాలతో పాటు రాజదండం, రాజముద్రిక, ఛత్రం, శంఖు, చక్రాలు, కిరీటం ధరింపజేస్తారు. సోమవారం నిర్వహించే ఈ పట్టాభిషేకానికి భద్రాచలం దేవస్థానం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శ్రీరామ మహాపట్టాభిషేకానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

## పర్యావరణాన్ని రక్షిద్దాం

ఈ వ్యవహారంలో తమ పోరాటం ఇంకా ముగియలేదని.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వారి స్వలాభం కోసం పర్యావరణ శ్రేయస్సును పణంగా పెట్టాలని చూడటం దురదృష్టకరమన్నారు. అభివృద్ధి ముసుగులో ఈ 400 ఎకరాల అటవీ భూమిలోని పచ్చని చెట్లను, అటవీ సంపదను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఈ భూములను కాపాడుకోవడానికి శాంతియుతంగా, దృఢ నిశ్చయంతో సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఉద్యమాన్ని నడిపించారని... వారి ధైర్యానికి అభినందనలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. విద్యార్థులు విలాసాలను అడగడం లేదని... కేవలం అడవిని రక్షించాలని, 400 ఎకరాల పచ్చదనాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. విద్యార్థులను నిందించబడం, వారి ఉద్దేశాలను తప్పుపట్టడం వంటివి చేస్తోందని పేర్కొన్నారు. సెంట్రల్ యూనివర్సిటీని ఇక్కడి నుంచి వేరే చోటికి మార్చుతామంటూ విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తూ.. ఈ పోరాటం వారి నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అడవిని కాపాడకుండా ఎకో పార్క్ పేరుతో భూ ఆక్రమణకు ప్రభుత్వం కుట్ర చేస్తోందననారు. ఇది కేవలం యూనివర్సిటీపై జరిగిన దాడి కాదని... ప్రజాస్వామ్య విలువలు, పర్యావరణంపై జరుగుతున్న దాడని కేటీఆర్ లేఖలో రాసుకొచ్చారు. ఈ భూములను విక్రయించే లేదా అడవులను నాశనం చేసే ప్రాజెక్టులను చేపట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల పాటిస్తూ..భూముల వేలాన్ని నిలిపివేయాలన్నారు.

## దేశంలోనే రెండో స్థానం

ఉంటుందని.. అప్పటికి తలసరి ఆదాయంలో దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా ఏపీ ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అందుకోసం ఏం చేయాలనే ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తున్నామని.. ఆ దిశగా ప్రజలు సహకరించాలని చంద్రబాబు కోరుతున్నారు. ఏపీలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో పురోగతి కనిపిస్తోంది. రాష్ట్రంలో విశాఖ లాంటి ప్రధాన ఓడరేవుల ద్వారా వాణిజ్యం పెరిగింది. 2024 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు విశాఖ ఓడరేవు 35.77 మిలియన్ టన్నుల ట్రాఫిక్‌ను నిర్వహించింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే ఎంతో పెరిగింది. పునరుత్పాదక ఇంధన రంగంలో వేలాది కోట్ల పెట్టుబడులు పెరగడం వృద్ధి రేటు పెరగడానికి కారణం. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈజ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ మెరుగుపడింది. పారిశ్రామిక విధానాల్లో సంస్కరణలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక ఆర్థిక మండళ్ల అభివృద్ధి, రవాణా సౌకర్యాల విస్తరణ లాంటివి ఈ వృద్ధికి కారణమయ్యాయి. విశాఖలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు, అమరావతి రాజధాని నిర్మాణం వేగవంతం, రవాణా సౌకర్యాల విస్తరణ లాంటి ప్రాజెక్టులు కూడా ఈ వృద్ధికి ఊతమిచ్చాయి. వృద్ధి రేటును ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ ఈజ్ రైజింగ్ అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు సీఎం చంద్రబాబు. ప్రభుత్వ పాలసీలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని.. వృద్ధి రేటు సాధించడం రాష్ట్ర ప్రజల సమష్టి విజయమన్నారు. బంగారు భవిష్యత్ కోసం కలిసి ప్రయాణాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

## కొత్తగా 16 నేషనల్ హైవేలు

వేగవంతం చేయాలని కోరారు. తెలంగాణలో రహదారులతోపాటు విమానాశ్రయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. తెలంగాణలో 2,500 కి.మీ మేర జాతీయ రహదారులు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం మరో 2,500 కి.మీ రహదారుల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్డు (RRR) కాకుండా, రూ. 12,619.27 కోట్ల అంచనా వ్యయంతో 691.52 కిలోమీటర్ల పొడవున 16 జాతీయ రహదారులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం 1,550.529 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇప్పటి వరకు 904.097 హెక్టార్ల భూమిని మాత్రమే సేకరించారు. మిగిలిన భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఇదివరకే లేఖలు రాసిన విషయాన్ని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. దాదాపు 66 సంవత్సరాల కాలంలో తెలంగాణ ప్రాంతం అంతటా మొత్తం 2,500 కి.మీ రహదారులు నిర్మించారని, గత 10 సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం జాతీయ రహదారులను 2,500 కి.మీ నుండి 5,000 కి.మీకి రెట్టింపు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలలో కొత్తగా ఏర్పడిన జిల్లాలతో సహా, వాటిలో 32 జిల్లాలను జాతీయ రహదారులతో అనుసంధానించిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి దక్కుతుందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ఈ 11 సంవత్సరాలలో, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులను నిర్మించింది రూ. 1,20,000 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.
ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ఈ 11 సంవత్సరాలలో, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ. 1,20,000 కోట్లకు పైగా ఖర్చుతో జాతీయ రహదారులను నిర్మించిందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇది ఆయా ప్రాంతాల సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక పురోగతికి ఎంతో దోహదపడిందన్నారు. అంతేకాకుండా, అనేక ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోయాయి. రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాలతో సహా రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లో, వాటిలో 32 జిల్లాలను జాతీయ రహదారులతో అనుసంధానించిన ఘనత ప్రధాన మంత్రి మోదీకే దక్కుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రస్తుతం నిర్మిస్తున్న జాతీయ రహదారులకు అవసరమైన భూమిని సకాలంలో సేకరించి అందిస్తే, కేంద్ర ప్రభుత్వం సంబంధిత రహదారి ప్రాజెక్టులను నిర్ణీత సమయంలో పూర్తి చేయడం సాధ్యమవుతుందని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ విషయంలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని, సంబంధిత జాతీయ రహదారుల ప్రాజెక్టులకు అవసరమైన భూమిని సకాలంలో అందించి, నిర్ణీత సమయంలో ప్రాజెక్టులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభ్యర్థించారు.

## రాష్ట్రవ్యాప్తంగా జార్జ్ రెడ్డి సంస్మరణ సభలు

**సికింద్రాబాద్:**

ఉస్మానియా యూనివర్సిటీ అరుణ తార జార్జిరెడ్డి అమరత్వ యాదిలో ఏప్రిల్ 05 నుండి 15 వరకు జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సంస్మరణ సభలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఓయూలో ప్రెస్ మిట్ నిర్వహించారు.

# నక్సల్స్ శాంతి మంత్రం

**ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో కొనసాగుతున్న గాలింపు చర్యలతో శాంతి చర్చలకు తాము సిద్ధమేనని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) ప్రకటించింది. గతంలో కూడా దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నక్సల్‌స్‌ను శాంతి చర్చలకు ఆహ్వానించడం ముఖాముఖి చర్చలు జరగడం తెలిసిందే. కానీ అవి చివరకు ఫలించలేదు.**



ఇప్పుడు మావోయిస్టుల్లో కూడా ఎన్నడూ లేని విధంగా నిస్పృహ ఆవరించినట్టు చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఇటీవల ఎన్‌కౌంటర్‌లో బయటపడిన ఒక లేఖ బట్టి తెలుస్తోంది. నక్సలైట్లకు సురక్షిత ప్రాంతమంటూ లేకుండా పోయిందని ఆ లేఖ వెల్లడించింది. అయితే ఇప్పుడు శాంతి చర్చలు జరిపేందుకు అనువైన వాతావరణం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) డిమాండ్ చేసింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో తాజాగా విడుదల చేసిన లేఖ వెలుగులోకి వచ్చింది. అయితే మావోలు కొన్ని షరతులు విధించారు. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిశా, జార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలని డిమాండ్ చేశారు. విప్లవ ప్రభావిత ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కొత్త క్యాంపులు ఏర్పాటు చేయొద్దన్నారు. ఈ షరతులకు ఒప్పుకుంటే తక్షణమే కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటించారు. ఆపరేషన్ కగార్ పేరుతో సాధారణ ఆదివాసీ ప్రజానీకంతోపాటు అగ్రనేతల వరకు 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, అనేక మందిని చిత్రహింసలకు గురిచేసి చంపేస్తున్నారని, అందుకే ఈ యుద్ధాన్ని జినోసైడ్ (నరసంహారం)గా పేర్కొంటున్నట్టు వెల్లడించింది. ఈ లేఖకు చత్తీస్‌గఢ్ సిఎం విజయశర్మ స్పందించారు. మొదట ఈ లేఖ సాధికారత ఎంతవరకు ఉందో పరిశీలిస్తామని పేర్కొన్నారు. గతంలో కూడా కొన్ని సందర్భాల్లో శాంతి చర్చలకు మావోయిస్టులు పిలుపునిచ్చారన్నారు. అయితే ఇప్పుడు శాంతి చర్చలకు మావోయిస్టులు విధించిన డిమాండ్లను పరిగణనలోకి తీసుకునేది లేదన్నారు. గతంలో ప్రభుత్వం శాంతిచర్చల కోసం కమిటీలను ఏర్పాటు చేసిందని, ఇప్పుడు మావోయిస్టులే శాంతి చర్చలకు సిద్ధం అవుతుంటే వారు ఒక కమిటీ లేదా ఒక ప్రతినిధిని నియమించాలని ముఖ్యమంత్రి విజయశర్మ సూచించారు. 2026 మార్చి 31 లోగా చత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లు అన్నవారెవరూ లేకుండా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. భద్రతా దళాలు నిత్యం దండకారణ్యాన్ని జల్లెడపడుతున్నాయి. ప్రభుత్వం ఒకవైపు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తూ మరోవైపు నక్సల్ గాలింపు ముమ్మరం చేసింది. ఈ ద్విముఖ వ్యూహం బాగానే పని చేసిందని చెప్పవచ్చు. ఇదంతా ఒక్క రోజులోనే జరిగిందనడం పొరపాటు. నిఘా వర్గాలను బలోపేతం చేశారు. భద్రతా దళాల సాయంతో మావోల పట్టున్న ప్రాంతాలను నిర్వీర్యం చేయగలిగారు. అత్యాధునిక డ్రోన్లు, నిఘా పరికరాలు, కృత్రిమ మేధ, ఉపగ్రహ ఛాయాచిత్రాల వంటి సాయంతో నక్సల్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయగలుగుతున్నారు. అలాగే నక్సల్స్ ఆర్థిక మూలాలపై కూడా దాడులు జరుగుతున్నాయి. ఎన్ఐఎ, ఇడి వంటి కేంద్ర సంస్థలు కొన్ని కోట్ల రూపాయల నిధులను స్వాధీనం చేసుకుంటున్నాయి. నక్సల్‌స్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వారిని కూడా కట్టడి చేయగలిగారు. ఇవన్నీ ఒకవైపు సాగిస్తూనే నక్సల్ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు బాగా విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2014 నుంచి 2024 మధ్య కాలంలో ఆయా ప్రాంతాల్లో దాదాపు 11,503 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 20 వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు ఏర్పాటయ్యాయి. దీనివల్ల అక్కడి ప్రజల జీవన విధానాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. వెయ్యికి పైగా బ్యాంకు శాఖలు, 937 ఏటిఎంల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు ముమ్మరం అయ్యాయి. 20042014 మధ్యకాలంతో పోలిస్తే ఇప్పుడు హింసాత్మక సంఘటనలు సగానికి సగం తగ్గాయి.
ఏడాది కాలంలోనే చత్తీస్‌గఢ్ ప్రాంతంలో 380 మంది నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారు. 1194 మంది అరెస్టు కాగా, 1045 మంది లొంగిపోయారు. వాస్తవంగా చెప్పాలంటే నక్సలిజ ప్రభావం చాలా వరకు తగ్గిందనే చెప్పవచ్చు. ఒకప్పుడు మావోయిజానికి ఆదివాసీ యువకులు విపరీతంగా ఆకర్షితులయ్యేవారు. కానీ అప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. భూస్వాములకు వ్యతిరేకంగా వర్గపోరాటం సాగించడమే లక్ష్యంగా నక్సల్స్ సాగుతున్నప్పటికీ చత్తీస్‌గఢ్‌లో ధనిక రైతులే తప్ప భూస్వాములు ఎవరూ లేరు. ఇప్పుడు అటవీ భూముల్లోని ఖనిజాల కోసం ఆరాటం పడుతున్న కార్పొరేట్ సంస్థలపైనే ఆదివాసీలు వర్గ పోరాటం చేయాలి. లేదా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ యంత్రాంగంపై పోరాటం చేయాలి. కానీ ఆర్థిక బలోపేతమే ముఖ్యమనుకుంటున్న ప్రజల ఆలోచనలు ఈ పోరాటాలకు కలిసిరావడం లేదు. మావోయిస్టులతో ప్రభుత్వ చర్చల విషయం ఎన్నోసార్లు వినిపించినా, అది పెద్ద స్థాయిలో కార్యరూపం దాల్చింది మాత్రం 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో. వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం మావోయిస్టుల మధ్య శాంతి చర్చలు జరిగాయి. 2004 అక్టోబర్ 15 నుంచి 18 వరకు చర్చలు జరిగాయి. ఈ చర్చలకు ముందే, పీపుల్స్ వార్ గ్రూపు మిగిలిన సంస్థలతో కలసి భారత కమ్యూనిస్టు పార్టీ - మావోయిస్టుగా అవతరించింది.
నల్లమల అటవీ ప్రాంతం నుంచి బయటి ప్రపంచంలోకి వచ్చిన మావోయిస్టులు, హైదరాబాద్‌లోని మంజీరా ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లో బస చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ భవనంలో చర్చలు జరిగాయి. ప్రభుత్వంతో పాటు విరసం నాయకులు వరవరరావు, కళ్యాణ రావు వంటి వారు ఈ చర్చలు కార్యరూపం దాల్చడానికి కృషి చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్ శంకరన్ వంటి వారు మధ్యవర్తిత్వంలో కీలకంగా వ్యవహరించారు. మావోయిస్టు పార్టీ తరపున రామకృష్ణ, సుధాకర్, గణేశ్, జనశక్తి నుంచి అమర్, రియాజ్ వంటి వారు ఈ చర్చల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం తరపున అప్పటి హోం మంత్రి జానా రెడ్డి సహా 8 మంది బృందం చర్చల్లో పాల్గొంది. భూమి లేని వారికి భూమి పంపిణీపై ప్రధానంగా అప్పటి చర్చలు సాగాయి. చర్చలు సానుకూలంగా జరిగాయని, మళ్లీ చర్చలు జరుపుతామని మొదట్లో ప్రకటించినా, మొత్తంగా ఆ చర్చలు సఫలం కాలేదు. 2005 జనవరి 17న తాము చర్చల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది మావోయిస్టు పార్టీ. 2004 ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ హయాంలో మావోయిస్టుల ఏరివేతను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎలా చురుగ్గా చేపట్టిందో, ఈ చర్చల విఫలం తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలానే మావోయిస్టుల ఏరివేతను కొనసాగించింది తరువాత కూడా ఈ చర్చల అంశం చర్చకు వస్తూనే ఉంది. అనేకసార్లు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి, మావోయిస్టుల నుంచి కూడా శాంతి చర్చలకు సిద్ధమే అనే ప్రకటనలు ఇవ్వడం, దానికి మావోయిస్టులు షరతులు పెట్టడం సాధారణం అయింది. కొన్నిసార్లు ప్రభుత్వం తరపున వచ్చిన ప్రకటనలు మోసపూరితమైనవిగా మావోయిస్టులు ప్రకటించిన సందర్భాలున్నాయి. కానీ, ఏదీ పక్కాగా ముందుకు వెళ్లలేదు. లేఖలకే పరిమితమైంది. ఇప్పుడు తాజాగా ఈ చర్చల అంశం మరోసారి ముందుకొచ్చింది.
నిషేధిత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టులు)తో చర్చలు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి విజయ్ శర్మ తెలిపారు. అయితే మావోయిస్టుల లేఖ ప్రామాణికతను ఇంకా ధృవీకరించాల్సి ఉందని మీడియాకు చెప్పినట్టు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం పేర్కొంది.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క బుల్లెట్ కూడా పేల్చాలని అనుకోవడం లేదని, అందుకే పునరావాస విధానాన్ని మళ్లీ తీసుకొచ్చామని మరోసారి చెప్పదలుచుకున్నాను. చాలా మంది (నక్సల్స్) లొంగిపోయారని, వారి జీవితాలను సుస్థిరంగా ఉంచే ప్రయత్నంతో పునరావాసం కల్పిస్తున్నారని చెప్పారు. పోలీసు శిబిరాల ఏర్పాటును ఆపాలని మావోయిస్టులు కోరుతున్నారు. ప్రభుత్వం పోలీసు శిబిరాలు ఏర్పాటు చేయడం ఆపేస్తే యుద్ధాన్ని విరమిస్తామని మావోయిస్టులు చెబుతున్నారు. మీరు విరామం ఇవ్వాలనుకుంటున్న ఈ యుద్ధం లాంటి పరిస్థితి ఏమిటి? యుద్ధ వాతావరణం లేదు... మీరు (మావోయిస్టు) నిజంగా చర్చ కోరితే మేం సిద్ధంగా ఉన్నాం. చర్చల కోసం మీరు ఒక వ్యక్తిని లేదా కమిటీని పంపవచ్చు లేదా మీకు నచ్చిన ఛానల్‌ను ఎంచుకోవచ్చు" అని ఆయన అన్నారు. ప్రభుత్వ పథకాలపైనే దృష్టి పెడుతున్నారు. ఎన్నికల్లో పాల్గొంటున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు గెలవడం దీనికి ఉదాహరణ. అలాగే నక్సల్స్ పేరుతో దొరికినవారందరినీ పిట్టల్లా కాల్చి చంపినంత మాత్రాన విప్లవ ఉద్యమాలు ఆగిపోవు, అన్యాయాలు, అక్రమాలు ఎక్కడ జరిగినా ఎదిరించడానికి పోరాటాలు సాగుతూనే ఉంటాయి. బాధితులు, దీనులు, అణగారిన ప్రజలు తమ తరపున పోరాడే వారికి ఆశ్రయం కల్పిస్తూనే ఉంటారు. విప్లవ భావజాలంతో మళ్లీ మళ్లీ చైతన్యవంతులవుతూనే ఉంటారు. ఇవన్నీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పరిశీలిస్తేనే శాంతికి మార్గం ఏర్పడుతుంది

# భారత ఇంజనీరింగ్ వండర్

## పంబన్ బ్రిడ్జిని ప్రారంభించిన ప్రధాని మోదీ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రామేశ్వరం చేరుకుని.. పంబన్ బ్రిడ్జిని ప్రారంభించారు.. రిమోట్ ద్వారా పంబన్ బ్రిడ్జిని మోదీ ప్రారంభించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని.. ఈ బ్రిడ్జిని ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఆయన వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జిని ప్రారంభించగానే, వంతెన పైకి వెళ్లింది. అదే సమయంలో ఆ వంతెన కింది నుంచి ఇండియన్ కోస్ట్గార్డ్ షిప్ ఆ ప్రాంతాన్ని దాటివెళ్లింది. ప్రపంచంలోనే వండర్ వంతెన ఇది. మరో వందేళ్లపాటు సేవలు అందించే వారధి ఇది. భారతీయ రైల్వేల ఇంజినీరింగ్ అద్భుతానికి పంబన్ బ్రిడ్జి తిరుగులేని ఉదాహరణ. దేశంలో తొలి వెర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జ్ పంబన్లో ఏర్పాటు చేశారు.
పంబన్ రైల్వే బ్రిడ్జ్...దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఫేమస్. ఇది తమిళనాడు ప్రధాన భూ భాగాన్ని రామేశ్వరం ద్వీపంతో కలిపే రైల్వే బ్రిడ్జి. అదే సమయంలో నౌకలు వచ్చినప్పుడు వాటికి దారి ఇచ్చేలా ఇది ఓపెన్ అవుతుంది. అయితే ఇది కట్టి వందేళ్లు దాటిపోవడం, దీని జీవితకాలం దాదాపు పరిసమాప్తమవడంతో, పంబన్లో కొత్త రైల్వే బ్రిడ్జిని నిర్మించారు.

**దీని ప్రత్యేకతలు ఏంటో చూడండి..**

2.08 కి.మీ. పొడవు ఉండే కొత్త రైల్వే బ్రిడ్జి
ఇంజనీరింగ్ వండర్గా నిలుస్తున్న కొత్త వంతెన
నౌకలు వెళ్లేందుకు బ్రిడ్జి మధ్యలో వర్టికల్ లిఫ్ట్
నౌకలకు దారి ఇచ్చే 72.5 మీటర్ల వర్టికల్ లిఫ్ట్
17 మీటర్ల ఎత్తు వరకు వెళ్లే లిఫ్ట్
భారీ నౌకలు కూడా సునాయాసంగా వెళ్లేలా నిర్మాణం
స్టెయిన్లెస్ స్టీల్తో బ్రిడ్జి నిర్మాణం
తుప్పు పట్టకుండా స్పెషల్ కెమికల్తో కోటింగ్
రూ.535 కోట్లతో పంబన్ వంతెన నిర్మాణం

**ఇండియాలో తొలి వర్టికల్ లిఫ్ట్ సీ బ్రిడ్జి**

పంబన్ పాత రైల్వే బ్రిడ్జి.. నౌకలు వచ్చినప్పుడు, రెండు భాగాలుగా ఓపెన్ అయి, ఆ నౌకలకు దారి ఇస్తుంది. అయితే ఈ కొత్త రైల్వే బ్రిడ్జి మాత్రం.. నౌకలు వచ్చినప్పుడు... లిఫ్ట్ లాగా పైకి వెళుతుంది. శ్రీరామనవమి రోజున మధ్యాహ్నం 12.45కి పంబన్ నుంచి రిమోట్ నొక్కి వంతెనను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఆ తర్వాత రామేశ్వరం నుంచి తాంబరానికి ప్రత్యేక రైలు పరుగులు తీసింది.. అనంతరం ఓ కోస్ట్ గార్డ్ షిప్, ఈ బ్రిడ్జి కింద నుంచి వెళ్లింది. రామేశ్వరం ద్వీపంలోని ఈ పంబన్ ప్రాంతానికి, రామాయణ ఇతిహాసంతో కూడా సంబంధం ఉంది. రామేశ్వరం లోని ధనుష్కోటి నుంచే రామసేతును వానరుల సాయంతో శ్రీరాముడు నిర్మించాడని రామాయణం చెబుతోంది. అలా మన సాంస్కృతిక వారసత్వానికి కూడా పంబన్ వంతెన ఓ వారధిలా ఉంది.

# స్టీల్ ప్లాంట్ నుంచి 3,823 ఉద్యోగులు తొలగింపు

■ సమ్మెకు సిద్ధమౌతున్న కార్మిక సంఘాలు

**జయభేరి, విశాఖపట్టణం, ఏప్రిల్ 6:**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు విషయంలో యాజమాన్యం వెనక్కి తగ్గడం లేదు. దశలవారీగా తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు రెండు దశల్లో 2,603 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారు. ఇప్పటకే 1,223 మంది పర్మినెంట్ ఉద్యోగులు వీఆర్ఎస్ తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆర్ఐఎన్ఎల్) ప్రైవేటీకరణ పనులు చకచక జరుగుతున్నాయి. ఒకపక్క అధికార టీడీపీ నేతలు ప్రైవేటీకరణ కాదని చెబుతున్నారు. కానీ మరోవైపు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో చోటు చేసుకున్న పరిణామాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అనుకూల విధానాలు అమలు జరుగుతున్నాయి. పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపు జరుగుతోంది. పర్మినెంట్ ఉద్యోగులను వీఆర్ఎస్ ద్వారా ఇంటికి పంపించే చర్యలు చేపడుతున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో మూడు నెలలకు 1,400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించాలని, అలా ఏడాదికి 5,600 మంది ఉద్యోగులను తొలగించాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే గతంలో 1,100 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించగా, తాజాగా మరో 1,503 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ఇంటికి పంపారు. మరో 440 మంది కాంట్రాక్ట్ కార్మికులను రెన్యూవల్ చేయకుండా బయట ఉంచారు. వారిని విధుల్లోకి తీసుకోవాలని రీజినల్ లేబర్ కమిషనర్ వద్ద చర్చలు కొనసాగుతున్నాయి. ఉక్కు మంత్రిత్వ శాఖ నుంచి యాజమాన్యంపై రోజు రోజుకు పెరుగుతున్న ఒత్తిడి కారణంగా.. ప్రతిరోజూ వందల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తున్నారు. మొదటిలో మెడికల్ ఫిట్‌నెస్ లేనివారిని, 55 ఏళ్ల పైబడినవారిని తొలగించాలని యాజమాన్యం నిర్ణయించింది. అందుకు సంబంధించిన జాబితాను విడుదల చేసింది. స్టీల్‌ప్లాంట్‌లో దాదాపు 15,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, దాదాపు 10,000 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో ఇప్పటి వరకు 2,603 మందిని తొలగించారు. పర్మినెంట్ ఉద్యోగుల్లో 1,223 మంది వీఆర్ఎస్ తీసుకున్నారు. ఇలా దశలవారీగా కాంట్రాక్ట్ ఉద్యోగులు, పర్మినెంట్ ఉద్యోగులు సంఖ్యను తగ్గిస్తున్నారు. ఉద్యోగుల సంఖ్య తగ్గుదల స్టీల్ ఉత్పత్తిపై ప్రభావం చూపుతుందని, ఇప్పటికే సెయిల్‌తో పోల్చితే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులు తక్కువగా ఉన్నారని ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఉద్యోగులను తగ్గించడంతో మరింత నష్టం వాటిల్లుతుందని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె సైరన్ మోగింది. ఈనెల 16 నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగుతున్నారు. మొత్తం 15,000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మెకు వెళ్లనున్నట్లు అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ నిర్ణయం తీసుకుంది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దిగొచ్చే వరకు సమ్మె చేపట్టాలని నిర్ణయించింది. సమ్మెకు ముందుగా శనివారం కూర్మన్నపాలెంలో భారీ రాస్తారోకో చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న రీజనల్ లేబర్ కమిషనర్‌తో మరోసారి చర్చలు జరపాలని నిర్ణయించింది. అలాగే ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అనంతరం సమ్మెలోకి కాంట్రాక్ట్ ఉద్యోగులు వెళ్లనున్నారు.

# ఘనంగా బిజేపి ఆవిర్భావ దినోత్సవం

- శక్తి స్థల్ వద్ద జెండా ఆవిష్కరించిన గాజుల నిరంజన్, కార్యాలయం వద్ద జెండా ఎగురవేసిన ఖాళీ ప్రసాద్ పట్టణ అధ్యక్షుడు
- ముఖ్య అతిదులుగా డా. ఖాళీ ప్రసాద్, డా.సిరంగి సంతోష్

**జయభేరి, పరకాల, ఏప్రిల్ 06:**




జెండా ఆవిష్కరణ సందర్భంగా డా ఖాళీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణామ్ జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలాన్నారు. డా సిరంగి సంతోష్ మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న సబ్కా సాత్ సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్ మంత్రాన్ని సాకారం చేసేందుకు పార్టీ కృషి చేస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎన్ని మోసపూరిత వాగ్దానాలు చేసిన ప్రజలు బిజెపి వైపు ఉన్నారని బిజెపి జెండా ఎగరవేయడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులకు, ప్రజలకు బిజెపి ఆవిర్భావ దినోత్సవ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్, గుజ్జ సత్యనారాయణ రావు, దగ్గు విజేందర్, చందుపట్ల రాజేందర్, దేవనూరి మేఘనాథ్, ఆర్పీ జయంత్ లాల్, బెజకి పూర్ణ చారి, సిరంగి సతీష్ కుమార్, మార్త రాజభద్రయ్య, మార్తా బిక్షపతి, ఎర్రం రామన్న, బండి రవి, కుక్కల విజయ్, సంఘ పురుషోత్తం, నాగెల్లి రంజిత్, మిడిదొడ్డి నరేష్, భాస్కరాచారి బాసాని సోమరాజు, కోడల లింగమూర్తి, వెలిశెట్టి శారద, సదారాణి, సంగీత, కానుగుల గోపీనాథ్, ఆకుల రాంబాబు, పాలకుర్తి తిరుపతి, మెంతుల సురేష్, దారుణ సునీల్ బూత్ అధ్యక్షులు దాసరి వెంకటేశ్వర్లు, మరాఠీ నర్సింగరావు, ముత్యాల దేవేందర్, పిట్ట కిషోర్, ఆకుల శ్రీధర్, పెండ్లిశెట్టి రాజేష్, ఒంటేరు వీరేష్ వెల్దండ హేమంత్, మేకల ప్రవీణ్, దామ సతీష్, ఉడుత చిరంజీవి, సంఘ నరేష్, వేముల అశోక్, గుడిగంటి రఘుపతి, పైండ్ల రంజిత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

- టెలిఫోన్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కళ్యాణం

**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ టెలిఫోన్ కాలనీలో శ్రీ కోదండ రాముని కళ్యాణం ఆనందోత్సాహాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారి కల్యాణంలో పాల్గొనీ సీతారాములకు పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ సీతారాములకు పట్టు వస్త్రాలతో,ముత్యాల తలంబ్రాలతో,జీలకర్ర బెల్లం సమర్పించి కళ్యాణం నిర్వహించడం, ఈ కళ్యాణాన్ని టెలిఫోన్ కాలనీ వాసులందరూ తిలకించి అనంతరం స్వామి అమ్మవార్లకు వడిబియ్యం పోశారు. ప్రతి ఏటా జరుపుకునే శ్రీ సీతారామ కళ్యాణం ఈసారి కూడా కాలనీవాసుల అందరీ మధ్య సుఖసంతోషాలతో జరగడం ఆనందదాయకమని ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శ్రీ సీతారామచంద్రుల ఆశీస్సులతో ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ కాలనీ ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, కోశాధికారి కే బి నరసింహ, కమిటీ మెంబర్స్, కాలనీ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం

GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

మన్సూరాబాద్ డివిజన్ లోని శ్రీరామ్ నగర్ కాలనీలో శ్రీ షిరిడి సాయిబాబా సంస్థానం ట్రస్ట్ చైర్మన్, GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా గారి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగిందని తెలియజేసుకుంటూ.. సీతారాముల కల్యాణ మహోత్సవానికి తలంబ్రాలను, పట్టువస్త్రాలు సమర్పించిన వారు ముత్యాల తలంబ్రాలను కార్పొరేటర్ గారి నివాసం నుండి ఆలయం వరకు ఎంతో ఘనంగా ఊరేగింపుతో భార్యా భజంత్రీలతో కొప్పుల లతా నర్సింహ్మా రెడ్డి చేతుల మీదుగా సమర్పించడం జరిగింది. రాముల వారి తరపున నుండి కొప్పుల ఉమా సర్వేశ్వర్ రెడ్డి వారి దంపతులు సమర్పించడం జరిగింది. సీతమ్మ వారి తరపు నుండి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (చైర్మన్), చిలుక రేఖా మధుసూదన్ రెడ్డి వారి దంపతులు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్, ఎల్బీనగర్ ఏసిపి కిష్టయ్య, టిటిడి బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి, జబర్దస్త్ కమెడియన్ రమేష్, వివిధ పార్టీ ప్రజా ప్రతినిధులు, వివిధ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు,అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## రాముల వారి కళ్యాణ మహోత్సవం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం ను ఆలయ కమిటీ వారు వైభవంగా నిర్వహించినారు. ఉదయం అభిషేకం, ఎదుర్కోలు ఉత్సవం, సీతారాముల కళ్యాణం, నాగవల్లి, బంతులాట, హారతి మంత్రపుష్పం, పల్లకి సేవ, వాసవి సోదరుల చే కోలాటం ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్య శర్మ వారి శిష్య బృందం వైభవంగా నిర్వహించినారు. కళ్యాణం నిర్వహించిన దంపతులు షీలా మధుసూదన్ శోభారాణి, గోవిందు కొండయ్య శైలజ, సోమ లక్ష్మయ్య సత్యవతి, సముద్రాల నరసింహ రేణుక, నీల ఈశ్వరయ్య అనసూయ, నీల చంద్రశేఖర్ శ్వేత దంపతులు కళ్యాణ మహోత్సవం నిర్వహించినారు. పట్టు వస్త్రాలు మంగళసూత్రం మెట్టెలు షీల మధుసూదన్ శోభ రాణి మహా ప్రసాదం కీర్తిశేషులు శీల నారాయణ యాదమ్మ జ్ఞాపకార్థం శీల మధుసూదన్ శోభారాణి శీల వెంకన్న జయప్రద మహా ప్రసాదం కార్యక్రమంకు సహకరించినారు అని ఆలయ కమిటీ వారు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పానగంటి మల్లయ్య, అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు ఆర్యవైశ్య సంఘం సభ్యులు సభ్యురాలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# లక్షల్లో వసూళ్లు..

## అటువైపు చూడని అధికారుల కళ్లు..?

- నాగారం టౌన్ ప్లానింగ్ లో టిఎస్ బిపాస్ చట్టాలు ఇక్కడ పనిచేయవు..!?
- చర్లపల్లి నుండి రాంపల్లి ప్రధాన రహదారి పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ షెడ్ నిర్మాణం
- సత్యనారాయణ కాలనీ వెళ్లే దారిలో భారీ అక్రమ షెడ్ నిర్మాణం
- నాగారం టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు చూస్తే దిమ్మ తిరిగి పోవాల్సిందే..!?



**జయభేరి, మేడ్చల్ జిల్లా, ఏప్రిల్ 06:**

నాగారం మున్సిపల్ పరిధిలో అనేక అక్రమాలు జోరుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కమిషనర్లు మారుతున్నారు కానీ టౌన్ ప్లానింగ్ అధికారులే ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదు... ఎందుకంటే కరెన్సీ వాసనకి అలవాటు పడ్డారో ఏమో తెలియదు కానీ అక్రమ నిర్మాణాలను యదేచ్ఛగా ప్రోత్సహిస్తూ వస్తున్నారు... ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు అనేక చట్టాలను తీసుకొస్తున్న అవి మాకు ఏమీ వర్తించవు అన్నట్టుగానే ప్రస్తుత మునిసిపల్ లోని కొంతమంది మాజీ నాయకుల అండ చూసుకొని అందిన కాడికి దండుకోవడమే పనిగా పెట్టుకుని వ్యవహరిస్తున్న తీరును చూస్తే ఔరా అనిపిస్తోంది... ఇక అసలు వివరాల్లోకెళ్తే.. చర్లపల్లి నుండి రాంపల్లికి




వెళ్లే మెయిన్ రోడ్డులో ఎలాంటి అనుమతులను లేకుండా యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు.. నేను నిర్మిస్తాను ఎవరు అడ్డుకుంటారో.. అడ్డుకోండి? అనే రీతిలో అన్నితానే చేస్తున్నాడు. ఒక నాయకుడు.. ఆయన చేసే అక్రమ నిర్మాణాలను చూస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలకు వంత పాడుతున్నట్లుగా ఉందంటూ స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

దీనిపై మున్సిపల్ కమిషనర్ అసలు విషయం ఏంటో తెలుసుకొని తక్షణమే దీనిపై స్పందించి సంబంధిత అక్రమ షెడ్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. అలాగే సత్యనారాయణ కాలనీ వెళ్లే దారిలో అక్రమ షెడ్ నిర్మాణాలు జరుగుతున్నా.. అవేవీ పట్టినట్టుగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు. ఐతే ఇంతగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై నాగారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారికి మాత్రం కనిపించడం లేదంటే మహా విడ్డూరంగా ఉంది కదా...! అసలు కమిషనర్ దృష్టికి ఈ విషయం వెళ్లిందో లేదో తెలియదు కానీ, ఇప్పటికైనా దీనిని పరిగణలోకి తీసుకొని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు బాహాటంగానే విస్మయం వ్యక్తం చేస్తున్నారు.





## అకాల వర్షాలతో పంట నష్టం

- జిల్లా కలెక్టర్ హామీ



**జయభేరి, యాదాద్రి:**

యాదాద్రి జిల్లాలో కురిసిన అకాల వర్షం,ఈదురు గాలులు, వడగళ్ల వానతో, నష్టపోయిన ఏ ఒక్క రైతు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. తుర్కపల్లి మండలంలోని దయ్యం బండ తండాలో వడగళ్ల వానకు నష్ట పోయిన వరి చేలు ,మామిడి, ఇతర వాణిజ్య పంటలను కలెక్టర్ రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన వరి పంటలు అకాల వర్షాల వల్ల రైతులు ఎన్నో ఎకరాలు నష్టపోయారని దానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం మొత్తం గ్రామాలలో , క్షేత్రస్థాయిలో పంటలను, తోటలను పరిశీలిస్తున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం నష్ట పోయిన ప్రతి రైతు యొక్క వివరాలు నమోదు చేసుకొని ఆ నివేదికను ప్రభుత్వానికి పంపించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నష్టపోయిన ఏ ఒక్క రైతు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని కలెక్టర్ రైతులకు భరోసానిచ్చారు.

# టీచర్స్ కాలనిలో వైభవంగా శ్రీ రామ నవమి వేడుకలు

**జయభేరి, దేవరకొండ :**

అనంత విశ్వంలో సుమధుర నామం శ్రీరామ నామమని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ అన్నారు. హైదరాబాద్ BNరెడ్డి నగర్ టీచర్స్ కాలనిలోని కాలని వేల్ఫేర్ అసోసియేషన్ భవనం నందు శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించి తదనంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించిన కేతావత్ బీల్యా నాయక్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతారాముల కల్యాణం చూసి తరించిన వారి జన్మ సార్ధకం అవుతుందన్నారు.



సీతారాముల అనుగ్రహంతో సర్వదోషాలు తొలగిపోతాయని అన్నారు. సీతారాముల జీవితం ఆదర్శప్రాయమైందని అన్నారు. నిజాయితీ, సన్మార్గానికి నిలువెత్తు నిదర్శనమని చెప్పారు. శ్రీరామచంద్రుడి జన్మదినమైన చైత్రశుద్ధ నవమి హిందువులకు అత్యంత విశేషమైన పండుగ. ప్రతి ఇంట్లో ఈ వేడుకను జరుపుకుంటారని అన్నారు. శ్రీరామచంద్ర స్వామి మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తంలో జన్మించాడు. సత్యమార్గాన్ని అనుసరిస్తూ తండ్రి ఆదేశాన్ని పాటించిన రాముడు ఎన్నో కష్టాలు పడ్డాడు. పద్నాలుగేండ్ల పాటు అడవుల్లో ఉన్న తర్వాత అయోధ్య చేరుకున్నాడు. అప్పుడు జరిగిన శ్రీరామ పట్టాభిషేకం చైత్ర శుద్ధ నవమి నాడే జరిగిందని భక్తులు భావిస్తారు. శ్రీ సీతారాముల కల్యాణం జరిగింది కూడా ఇదే రోజే కావడం విశేషం. అందుకే శ్రీరామ నవమి నాడు ఎంతో వైభవంగా సీతారాముల కల్యాణం జరుపుతారు. భక్తులకు పానకం, వడపప్పు పంచిపెడతారని అన్నారు. శ్రీరామచంద్రుడి ఆశీస్సులు అందరి ఉంటాయని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్ నందు అడ్మిషన్స్ ప్రారంభం




**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రం అయ్యిన పరవాడలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల సబ్ స్టేషన్ ఎదురుగా ఉన్న పరవాడ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్ నందు 202526 విద్యా సంవత్సరం గాను MPC, Bi. P.సి గ్రూపులలో ఏప్రిల్ 7 సోమవారం నుండి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవ్వుతున్నాయి అని కాలేజీలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల ఆధ్వర్యంలో విద్యాబోధన ఉంటుందని అమ్మాయిల తల్లిదండ్రులు ఈ అవకాశన్ని వినియోగించుకోవాలని పదవ తరగతి పూర్తి అయ్యిన వెంటనే జూనియర్ మరియు సీనియర్ ఇంటర్ అడ్మిషన్లు కొరకు కాలేజ్ కీ వచ్చి సంప్రదించాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మేఘ చలివేంద్రం వద్దా రాగి జావా




**జయభేరి, దేవరకొండ :**

సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ సందర్భంగా వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణములో మేఘ చలివేంద్రం వద్దా రాగి జావా పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ 104 A IPC బెల్లిదే మాధవి రవీందర్, డిస్టిక్ చైర్మన్ అర్థం రమేష్ డిస్టిక్ సెక్రెటరీ నీలా సంజీవ కుమార్ REC ఆలంపల్లి పద్మ వాసవి క్లబ్ అధ్యక్షులు సముద్రల సహాదేవుడు వనిత క్లబ్ అధ్యక్షులు గుమ్మడవెల్లి మహాలక్ష్మి వాసవి క్లబ్ కార్యదర్శి ఇడుకుల పుల్లయ్య కోశాధికారి గార్లపాటి శ్రీనివాసులు వనిత క్ల బ్ కార్యదర్శి వీరమల్ల భాగ్యమ్మ కోశాధికారి శీల చంద్రకళ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కర్నాటీ పురుషోత్తం ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొనగలరు.

# భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

■ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ నిర్వహించిన బిజెపి నాయకులు



**జయభేరి, దేవరకొండ :**

భారతీయ జనతా పార్టీ దేవరకొండ పట్టణ శాఖ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ 45,వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా దేవరకొండ పట్టణంలో ముత్యాలమ్మ బజార్, పాత పోలీస్ స్టేషన్ రోడ్డు, అంజయ్య కాలనీ, ఎల్ఐసి కాలనీ , తాటి కోల్ ఎక్స్ రోడ్, నందీశ్వర్ నగర్ తదితర ఏరియాలలో బిజెపి బూత్ అధ్యక్షులచే బిజెపి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలూ నాయక్, కర్నాటి సురేష్ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్ మరియు జిల్లా ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6వ తేదీన భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం జరిగింది.నాటి నుండి నేటి వరకు Nation First Party Second Self Last అనే నినాదంతో ముందుకు వెళ్ళుతూ అంత్యోదయ సిద్ధాంతాన్ని ఆధారంగా పనిచేస్తూ, పార్టీ 2 ఎంపీ సీట్లతో ప్రారంభమై,నేడు 20 రాష్ట్రాలలో అధికారంలో ఉన్నామంటే, కోట్లలాది మంది కార్యకర్తల నిబద్ధత, జాతీయభావం కారణంగా..పార్టీకోసం తమ జీవితాలను త్యాగం చేసిన నాయకులు మరియు కార్యకర్తలందరినీ స్మరణ చేసుకుంటూ కార్యకర్తలందరికీ "పార్టీ ఆవిర్భావ దినోత్సవ "శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ కన్వీనర్ నాయకులు నక్క వెంకటేశ్వర్లు, ఓ బి సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతల వెంకటేష్, ఇడం రవి కుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, జల్ద భాస్కర్, సముద్రాల సహదేవ్, గంజి హరి, గంప పని, రెడ్డి శంకర్, నారాయణదాసు చండీశ్వర్, అర్దం రమేష్, కాసుల శంకరయ్య,వజ్రా కుమార్, బెళితే మాధవి, గీతా రాణి, అప్పం అజయ్, పున్న వెంకటేశ్వర్లు, నీల సుమన్, శివ గౌడ్, చిలక రాజు బిక్కు, నాగేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.



## భాజపా ఆవిర్భావ వేడుకలు

**జయభేరి, వర్గల్, ఏప్రిల్ 06 :**

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గ్రామంలో ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరపడం జరిగింది. భారతదేశాన్ని విశ్వ గురువుగా ప్రపంచ దేశాలకు దీటుగా నిలబెట్టిన నరేంద్ర మోడీ కి ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే రోజులలో అన్ని గ్రామాలలో కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావాలని వస్తుందనీ ప్రతిజ్ఞ చేశారు .ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఈసూరి యాదగిరి, మండల నాయకులు కట్టే రమేష్, శీలం నర్సింలు, సత్యనారాయణ, తిప్పనబోయిన విట్టల్ ,బుస నర్సింలు, బండ్ల రవీందర్ గ్రామ పార్టీ అధ్యక్షులు జాలిగామ నర్సింలు గౌడ్, బూత్ అధ్యక్షులు కలకుంట్ల రమేష్, సంగం శ్రీనివాస్ బిజెవైయం నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

■ జెండా ఆవిష్కరణ చేస్తున్న బీజేపీ నేత శ్రీనివాస్




**జయభేరి, వర్గల్, ఏప్రిల్ 06 :**

వర్గల్ మండలం చౌదర్ పల్లి గ్రామంలో ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అలగే పార్టీ బలోపేతానికి కృషి వారు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ గ్రామ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## జాలిగామలో ఘనంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం


■ సీతారామ కళ్యాణం లో పాల్గొన్న ఎన్సీ సంతోష్ దంపతులు



**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 06 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామం హనుమాన్ దేవాలయం వద్ద నిర్మాణంలో ఉన్న రామాలయం వద్ద ఆదివారం శ్రీరామనవమి పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు, శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ సీ దంపతులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరికీ శ్రీ సీతారామ స్వామి కరుణాకటాక్షాలు ఉండాలని కోరుకుంటు, రామున్ని స్మరించిన, రామ నామాన్ని లిఖించిన, పుణ్యం లభిస్తుందని జాలిగామ గ్రామంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం నిర్వహించడం అభినందనీయమని యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం చల్లని మంచినీరు అందించడం, సంతోషకరమని జాలిగామలో యువత అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంటుందని యువకులను అభినందించారు, ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


## మంత్రి పొన్నం ను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు



**జయభేరి, వర్గల్, ఏప్రిల్ 06 :**

బంజారాహిల్స్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని శనివారం మర్యాదపూర్వకంగా వర్గల్ మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిశారు. ఈ కార్యక్రమంలో నరేందర్ రెడ్డి,రామ లింగారెడ్డి,సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి,నాయకులు సల్మాన్,నందకుమార్ భాస్కర్ పోతగాళ్ల మల్లేష్, నవీన్, ప్రభాకర్,భాస్కర్ తదితరులున్నారు

## శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**జయభేరి, పరకాల, ఏప్రిల్ 06:**

ఆదివారం పరకాల పట్టణంలోని రామాలయం, శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయాలలో జరిగిన శ్రీ సీతారామ స్వామివారి కల్యాణోత్సవ వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయ పూజారులు పూర్ణ కుంబంతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. స్వామివారికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ ప్రజల పైన శ్రీ సీతారామ స్వామివారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

## కనుల పండగగా సీతారాముల వారి కల్యాణం

**జయభేరి, పరవాడ:**



పరవాడ గ్రామంలో శ్రీ రామ నవమి పర్వదిన శుభ సందర్భంగా రామాలయం ప్రాంగణంలో వేద మంత్రోచ్చరణల మధ్య కన్నులపండువగా శ్రీ సీతారాముల కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా కళ్యాణోత్సవంలో పరవాడ సర్పంచ్ ఎస్ అప్పలనాయుడు దంపతులు, పరవాడ మండల ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు దంపతులు,మాజీ సర్పంచ్ చుక్కా రాము నాయుడు దంపతులు సీతారాముల కల్యాణోత్సవాలలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమం గ్రామ పెద్దలు చేతుల మీదుగా ప్రారంభించారు.
రాత్రి గ్రామ పురావిధిలలో అనుపు విగ్రహలతో రాములు వారిని ఊరేగించారు.
ఈ యొక్క కార్యక్రమంలో పరవాడ మాజీ సర్పంచ్ పైల అప్పారావు,పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, టి.డి.పి అధికార ప్రతినిధి పైల రామ చంద్రరావు, గ్రామ పెద్ద పైల పోతు నాయుడు, వార్డు మెంబెర్లు పైల అప్పలనాయుడు సత్యవేణి, గండి ఈశ్వరరావు, పోతల అప్పలనాయుడు, పైల వెంకట రావు, వర్రీ లక్ష్మీ , పైల హరీష్, పైల టి.వి అప్పారావు గ్రామ ప్రజలు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభివృద్ధి భాజపా తోనే సాధ్యం

■ బియ్యం పంపిణీ చేస్తున్న జిల్లా నాయకులు మఠం మహిపాల్

**జయభేరి, వర్గల్, ఏప్రిల్ 06 :**



పేదలకు రెండు పూటలు కడుపునిండా అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు కరోనా నుండి 2028 వరకు ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్న ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని గౌరారంలో జిల్లా నాయకులు మఠం మహిపాల్ యాదవ్, బూత్ అధ్యక్షులు మంకి యాదగిరి, సీనియర్ నాయకులు పూదరి ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దేశరక్షణకు ఉక్కు మనిషిగా దేశ ప్రజలకు సుభిక్షంగా కాపాడుతున్న పార్టీ బీజేపీ పార్టీ అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రేషన్ దుకాణాలలో ప్రతి ఒక్కరికి పంపిణీ చేసే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోల బియ్యం నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇస్తుంది చెప్పారు, కేవలం ఒక కిలో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుదని నరేంద్ర మోదీ కి కృతజ్ఞతలు తెలుపుతూ రేషన్ దుకాణంలో నరేంద్ర మోదీ గారి చిత్రపటాన్ని పెట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) ద్వారా రేషన్ బియ్యం పంపిణీలో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల బీజేపీ నాయకులు తిరుపతి రెడ్డి,నరేందర్ రెడ్డి, శ్రీపతి, యశ్వంత్ రెడ్డి, మల్లేష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో తిరుగులేని శక్తిగా బిజెపి

■ మోడీ సాహసోపేత నిర్ణయాలతో దేశం సుభిక్షం

■ ఘనంగా ఆవిర్భావ వేడుకలు

**జయభేరి, వర్గల్, ఏప్రిల్ 06 :**



ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ తిరుగులేని శక్తిగా ఆవిర్భవించినట్లు వర్గల్ మండల శాఖ అధ్యక్షులు టేకులపల్లి బాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్గల్ మండల కేంద్రంలో బిజెపి జెండా ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి, ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 తేదీ 1980లో బిజెపి ఆవిర్భవించగా, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ అసలు మూలాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా హిందూ సాంస్కృతిక, సాంప్రదాయాల పరిరక్షణ, దృఢమైన జాతీయ రక్షణ భావజాలం, మెజారిటీ హిందూ వర్గాల ఐక్యత, జాతీయ సమైక్యత లక్ష్యంగా బిజెపి పని చేస్తుందని తెలిపారు. అయితే అధికారం తమ లక్ష్యం కాదని, దేశ ప్రజలపై హిందూయేతరుల దాడిని తిప్పి కొట్టడమే ధ్యేయమని చెప్పారు. అటల్ బిహారీ వాజ్ పేయి, ఎల్కే అద్వానీ లక్ష్యాలు, ఆశయాలు, ఆకాంక్షను పునికి పుచ్చుకున్న ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. కేవలం 3 పార్లమెంటు స్థానాల నుండి ప్రస్థానం ప్రారంభించిన బిజెపి మూడవ పర్యాయం ఢిల్లీలో అధికారం చేపట్టి పేద, బడుగు, బలహీన, మైనార్టీ, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రోత్సాహకర విధానం, కఠిన చర్యలతో దేశం సుభిక్షంగా, ప్రశాంతంగా ఉందని అన్నారు. అయితే రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ శ్రీకాంత్, నేతలు మణికంఠ, బద్రీనాథ్, వెంకటేష్, బుచ్చిరెడ్డి, నాగరాజు, యశ్వంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సాయి, సంపత్, రాజు పాల్గొన్నారు.

## విస్తరణ.. ఇంకా ఉంది...

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 6:**

ఈసారి కచ్చితంగా జరుగుతుంది అనుకున్న తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మళ్లీ వాయిదా పడిపోయింది.. డైలీ సిరియల్ లా వ్యవహారం నడుస్తోంది. కొత్త మంత్రుల ఎంపిక విషయంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 3న విస్తరణ జరుగుతుందని అందరూ ఊహించినప్పటికీ, చివరి నిమిషంలో ఢిల్లీ నుంచి కొత్త ట్విస్ట్ లు తెరపైకి వచ్చాయి. మంత్రుల జాబితా ఖరారైనట్లు పార్టీ ముఖ్య నేతలు భావించినా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొన్ని పేర్లపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో పరిస్థితి మారింది. ఉగాది సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ తో సమావేశంలో కూడా విస్తరణ గురించి సూచనలు ఇచ్చారు. కానీ, రాహుల్ గాంధీ కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరుపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పటికే కొమటిరెడ్డి వెంకటరెడ్డి మంత్రిగా ఉండగా, ఆయన సోదరుడికి మరోసారి అవకాశం ఇవ్వడం ఎందుకని రాహుల్ ఆరా తీశారు. అయితే, రాజగోపాల్ కు పార్టీలో చేరినప్పుడే మంత్రి పదవి హామీ ఇచ్చామని నేతలు వివరించినప్పటికీ, తుది నిర్ణయం కోసం వేచి చూడాలని రాహుల్ సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. సీనియర్ నేత జానా రెడ్డి హైకమాండ్ కు రాసిన లేఖ సంచలనంగా మారింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదని, వాటికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. సామాజికవర్గాల వారీగా కూడా పలువురు నేతలు ఢిల్లీలో లాబీయింగ్ ను తీవ్రతరం చేశారు. ఇప్పటివరకు సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, వట్టిక శ్రీహరి, వివేక్ పేర్లు ఖరారైనట్లు ప్రచారం జరిగినా, రాహుల్ అభ్యంతరంతో ఈ జాబితాలో మార్పులు సంభవించే సూచనలు కనిపిస్తున్నాయి. సీనియర్లు, సామాజిక అంశాలు, జిల్లాల ప్రాతినిధ్యం వంటి అంశాలు తెరపైకి రావడంతో విస్తరణ జరగడానికి బ్రేక్ పడినట్లయింది.



## ఏప్రిల్ 30 వరకు రేషన్ కార్డుల దరఖాస్తుకు అవకాశం

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 6:**

తెలంగాణలోని రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ కేవైసీ గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. వాస్తవానికి మార్చి 31 తేదీ వరకే ఈ కేవైసీ పూర్తి చేసుకునేందుకు గడువు ముగిసింది. కేంద్ర ప్రభుత్వం మరో నెల పొడిగింపు ప్రకటనతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఊరట కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డుదారులకు సబ్సిడీ పంపిణీలో పారదర్శకత నిర్ధారించడంతో పాటు అనర్హులకు కార్డుల ఏరువేతపై కేంద్రం ఫోకస్ చేస్తుంది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద రేషన్ కార్డుదారులకు పలు రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలు ఉచిత బియ్యం అందిస్తున్నాయని తెలిసిందే. మార్చి 31లోగా ఈకేవైసీ పూర్తి చేయని వారికి రేషన్ కార్డులు రద్దు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. కానీ సర్వర్లు ప్రాబ్లమ్ ఉండటం, లబ్దిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు, సంక్షేమం దూరం కావొద్దని భావించి కేంద్రం ఏప్రిల్ వరకు ఈకేవైసీకి గడువు ఇచ్చింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డుదారులకు ఏప్రిల్ నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తి చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు గతంలో పలుమార్లు గడువు పొడిగించింది. ఇటీవల ఏప్రిల్ 30 తేదీ వరకు ఈకేవైసీకి గడువు ఇచ్చింది. ఈకేవైసీ ప్రక్రియ కోసం డెడ్ లైన్ పొడిగించడం ఇది నాలుగోసారి అని, ప్రస్తుతం రేషన్ కార్డులు ఉన్న వారికి ఇక భవిష్యత్తులోకి గడువు పొడిగింపు ఉందని కేంద్రం స్పష్టం చేసింది. పారదర్శకత కోసం, అక్రమాలు అరికట్టేందుకు చేసే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయకపోవడం లబ్ధిదారుల నిర్లక్ష్యమని అధికారులు అంటున్నారు. ఏప్రిల్ 30 తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేసుకున్న రేషన్ కార్డుదారులు మాత్రమే ప్రయోజనాలు పొందనున్నారు. తరువాత ఈకేవైసీ పూర్తి చేసుకోని రేషన్ కార్డు దారులకు బియ్యం, సహా రేషన్ సరుకులు అందించరు. అలాంటి రేషన్ కార్డులను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం సూచించింది.
ఈ ఈకేవైసీ ప్రక్రియను డీలర్లను సంప్రదించి పూర్తి చేయవచ్చు. గడువు ముగుస్తుందని మార్చి నెలాఖరులో రేషన్ షాపులకు క్యూ కట్టడం, ఆన్ లైన్ పోర్టల్ లో ప్రయత్నించడంతో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దాంతో ప్రభుత్వం మరో నెలల రోజులు ఈకేవైసీ గడువు పొడిగించింది. రేషన్ షాపులు, ఆధార్ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లను సంప్రదించి eKYC ప్రక్రియను సులభంగా చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. చివరి తేదీ వరకు ఎదురుచూడకుండా వీలు చూసుకుని, సాధ్యమైనంత త్వరగా రేషన్‌కార్డు దారులు ఈకేవైసీ పూర్తి చేసుకుని కార్డు రద్దు అవకుండా, లేక రేషన్ సరుకులు నిలుపుదల చేయకుండా జాగ్రత్త పడాలని చెబుతున్నారు. ఎంత బిజీగా ఉన్నా తప్పకుండా ఈకేవైసీ ప్రక్రియను ఏప్రిల్ నెలాఖరులోగా చేసుకుని లబ్ధిదారులు కేంద్రం, రాష్ట్రం అందిస్తున్న ప్రయోజనాలను పొందాలని సూచించారు.మరోవైపు తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు ఈ నెల నుంచి సన్న బియ్యం అందిస్తోంది. ఉగాది పండుగ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గంలో సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టారని తెలిసిందే. కొత్త రేషన్ కార్డులకు సైతం దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని.. అప్లికేషన్లు పరిశీలించి జారీ చేస్తూనే ఉంటామన్నారు. రెండు రకాలుగా కొత్త రేషన్ కార్డులను జారీ చేయనుంది ప్రభుత్వం. ఇదివరకే ఉన్న వారి కార్డులను సైతం అప్ డేట్ చేసి ఏటీఎం, పాన్ కార్డు తరహాలో ఉండే కార్డులను అందజేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల తెలిపారు.

# ఇంటర్ పేపర్ కరెక్షన్స్‌లో కీలక మార్పులు



**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 5:**

తెలంగాణలో ఇంటర్ ఫలితాల్లో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా ఇంటర్మీడియట్ బోర్డు జాగ్రత్తలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా జవాబుపత్రాల మూల్యాంకనంలో ఈసారి ముందస్తు పునఃపరిశీలన చేయాలని బోర్డు నిర్ణయించింది.

సాధారణంగా ఇంటర్ ఫలితాలు వెలువడిన తర్వాత మార్కులు సరిగా రాలేదని, లెక్చరర్లు చేసిన తప్పిదం వల్లే తాము ఫెయిల్ అయ్యామని విద్యార్థులు ఆరోపిస్తుంటారు. ఈ నేపథ్యంలో 35 మార్కులు రాని విద్యార్థులకు సంబంధించి జవాబుపత్రాలను చీఫ్ ఎగ్జామినర్, సబ్జెక్టు నిపుణులతో క్షుణ్ణంగా పునఃపరిశీలన చేయించనున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. దీంతో విద్యార్థులకు అన్యాయం జరగకుండా ఉంటుందని వారంటున్నారు.

ఏప్రిల్ 10 నాటికి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తికానుంది. ఫలితాలను ఏప్రిల్ చివరి వారంలోగా వెల్లడించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణలో ఇంటర్ ప్రధాన పరీక్షలు మార్చి 20తో ముగిసిన సంగతి తెలిసిందే. అయితే బ్రిడ్జ్ కోర్సు, అన్ని సబ్జెక్టుల పరీక్షలు మార్చి 25తో పూర్తయ్యాయి. ఇప్పటికే ప్రధాన సబ్జెక్టులకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ కూడా ప్రారంభమైంది. పరీక్షల మొదట్లో ప్రశ్నపత్రాల్లో చిన్నచిన్న తప్పులు దొర్లినా... ఆ తర్వాత అన్ని సబ్జెక్టుల పరీక్షలు సజావుగా జరిగాయి.

పరీక్షల ఫలితాలను ఏప్రిల్ నెలాఖరులోపు విడుదల చేయాలని ఇంటర్ బోర్డు భావిస్తోంది.రాష్ట్రంలో అగ్రికల్చర్, ఫార్మ, ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన 'టీజీఎప్‌సెట్ 2025' పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పరీక్షల ప్రారంభానికి కనీసం రెండు మూడు రోజుల ముందుగా... అంటే ఏప్రిల్ నాలుగో వారంలో ఫలితాలు విడుదల చేయాలని ఇంటర్ లక్ష్యంగా పనిచేస్తోంది.గతేడాది మార్చి 19 నాటికి ఇంటర్ పరీక్షలు పూర్తికాగా.. ఏప్రిల్ 24న ఫలితాలు విడుదల చేశారు. ఈసారి కూడా దాదాపు అదే తేదీలో ఫలితాలు వెలువడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9.80 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

### మూల్యాంకనం సాగుతోందిలా..

- ఇంటర్ పత్రాల మూల్యాంకనం కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి లోపాలు లేకుండా మూల్యాంకనం ప్రక్రియ చేపట్టనున్నారు. మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత.. ఫలితాలను విడుదల చేయనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 19 స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 14 వేలమంది సుమారు 60 లక్షల జవాబుపత్రాలను దిద్దాల్సి ఉంటుంది.
- సమాధాన పత్రాలను పలు స్థాయిల్లో పరిశీలిస్తారు. ఆ తర్వాతే మార్కులను ఖరారు చేస్తారు. రోజుకు ఒక్కో అధ్యాపకుడు 40 సమాధాన పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. వారిని అసిస్టెంట్ ఎగ్జామినర్ అంటారు.
- పరీక్షలో ఇచ్చిన ప్రశ్నలకు తగిన సమాధానాలను నిపుణులు మూల్యాంకన ప్రక్రియ కోసం పంపుతారు. వీటి ఆధారంగా అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రాలను పరిశీలించి మార్కులు వేస్తారు. కొన్ని పరిమితుల మేరకు విచక్షణాధికారంతో మార్కులు వేయవచ్చు. తర్వాత ఆ జవాబు పత్రం చీఫ్ ఎగ్జామినర్‌కు వెళ్తుంది. వారు మార్కులను, మూల్యాంకన తీరును పరిశీలిస్తారు.
- తర్వాతి దశలో జవాబుపత్రం సబ్జెక్టు నిపుణుల వద్దకు వెళ్తుంది. ఎక్కడైనా పొరపాటు ఉంటే నిపుణులు సరిచేస్తారు. ప్రతీ ప్రక్రియ, ప్రతీ మార్పును చీఫ్ ఎగ్జామినర్ రికార్డు చేస్తారు. ఇన్ని దశలు దాటిన తర్వాత మార్కులు బోర్డుకు వెళతాయి. మూల్యాంకన సమయంలో ఇచ్చిన కోడ్‌ను ఇంటర్ బోర్డ్‌లో డీకోడ్ చేస్తారు. ఆ విద్యార్థి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.
- సాఫ్ట్‌వేర్‌పై ట్రయల్ రన్ చేస్తారు. కొందరు విద్యార్థుల మార్కులను నమోదు చేసి.. సాంకేతిక లోపాలేమైనా ఉన్నాయా.. అని మానవ వనరుల ద్వారా పరిశీలిస్తారు. ఇలా మొత్తం 4 రౌండ్లు ట్రయల్ జరుపుతారు. ఎలాంటి సమస్య లేకపోతే.. తుది దశ ఫలితాలను నమోదు చేస్తారు.
- జవాబుపత్రాల మూల్యాంకనం ఇవాళ ప్రారంభమై నెల రోజుల పాటు కొనసాగుతుంది. మే మొదటి వారంలో ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది. మూల్యాంకనం ప్రక్రియను ఈసారి ఆధునిక పద్ధతుల్లో చేపట్టబోతున్నారు. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయానికి ప్రతీ కేంద్రాన్ని అనుసంధానం చేస్తున్నారు.
- ఈసారి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. మూల్యాంకనం చేసే అధ్యాపకులు ఏ సమయంలో వస్తున్నారు.. ఎప్పుడు కేంద్రం నుంచి వెళ్తున్నారనే వివరాలను రికార్డు చేస్తారు.
- ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేని అధ్యాపకులనే మూల్యాంకనం కోసం ఎంపిక చేయాలని.. జిల్లా అధికారులకు తెలంగాణ ఇంటర్ బోర్డ్ ఆదేశాలిచ్చింది.
- ఫస్ట్, సెకెండ్ ఇయర్ కలిపి మొత్తం 9లక్షల 96వేల 971 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. వీరందరి అన్ని సబ్జెక్టులు కలిపి సుమారు 60 లక్షల సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాల్సిఉంది.
- స్పాట్ వ్యాల్యుయేషన్ జరిగే 19 కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. శాస్త్రీయ పద్ధతిలో ఈసారి మూల్యాంకనం ఉండబోతోంది. ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.




## మృతిని కుటుంబానికి 50 లక్షల నష్ట పరిహారం

- మృతిని కుటుంబంలో ఒకరికి శ్వాసిత ఉద్యోగం, పిల్లల చదువులకి పూర్తి బాధ్యత తీసుకొన్న యాజమాన్యం

**జయభేరి, జయభేరి:**

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలో విశాఖ ఫార్మసిటీ లిమిటెడ్ రాంకీలో శనివారం అర్ధరాత్రి జరిగిన రసాయనిక వాయువులను పీల్చడం వలన చీపురుపల్లి అప్పలనాయుడు మృతి చెందాడు. కార్మిక కుటుంబానికి రాంకీ యాజమాన్యం 50 లక్షల నష్టపరిహారం చెల్లించడానికి, దహన సంస్కారాలు నిమిత్తం ఒక లక్ష రూపాయలు తక్షణమే చెల్లించారు. అప్పలనాయుడు పిల్లలకు ఇంటర్మీడియట్ వరకు కార్పొరేట్ విద్య అందించడానికి అలాగే అప్పలనాయుడు భార్యకి శాశ్వత ఉపాధి కల్పించడానికి యాజమాన్యం అంగీకరించింది. గ్రూప్ ఇన్సూరెన్స్ మరో 10 లక్షలు చెల్లించటానికి చట్ట ప్రకారం రావలసిన అన్నీ చెల్లించడానికి యాజమాన్యం వారు అంగీకరించారు. ఈ చర్చల్లో జడ్పిటిసి పిఎస్ రాజు, మాజీ జెడ్పిటిసి పైల జగన్నాథరావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరి వెంకటరమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ, వరి వసంత, ఆర్. గోపాలకృష్ణ, యాజమాన్య ప్రతినిధులు గిరిధర్ బక్షి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీని ప్రారంభించి దళిత మహిళ ఇంట్లో భోజనం



**జయభేరి, గుడిపల్లి :**

దళిత మహిళ ఇంట్లో దళిత మహిళలతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే సన్నబియ్యం పంపిణీ చేస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, పేదలకు పెద్ద దిక్కుగా దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని గుడిపల్లి మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రారంభించారు. గుడిపల్లి మండల కేంద్రంలో సన్నబియ్యం లబ్ధిదారులు, దళిత మహిళ ఇంట్లో దళిత మహిళలతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు.

## ఉత్సవాలతో గ్రామస్తులలో ఐక్యత

- డీఎస్పీ శ్రీధర్ రెడ్డి.



**జయభేరి, కోదాడ :**

అనంతగిరి మండలం లక్కవరం గ్రామంలో శ్రీరామ నవమి సందర్భం గా బుర్రా బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, సామూహిక కార్యక్రమాలతో ప్రజల్లో ఐక్యత పెరుగుతుందన్నారు. గ్రామంలో అన్నదాన నిర్వహించిన బుర్ర బ్రదర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్రా సుధారాణి పుల్లారెడ్డి, మాజీ సింగల్ ఎండో చైర్మన్ బుర్రా నరసింహారెడ్డి, అనంతగిరి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి , ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు కొండపల్లి వాసు ,దేగ కొండయ్య , బాబు నాయక్ ,మాజీ సర్పంచి కూరపాటి భూపతి, ఉప సర్పంచ్ ఎస్కే కబీర్ సాహెబ్, మాజీ ఎంపీటీసీ కర్ష అనూష భాస్కర్, దేవరపల్లి కోటి రెడ్డి, బుర్రా గోవింద రెడ్డి, బుర్రా బస్వి రెడ్డి, ఉప్పునూరి వెంకటరెడ్డి, కర్నాటి రాజమోహన్ రెడ్డి, ఆళ్ల సురేందర్ రెడ్డి, కూరపాటి అచ్చయ్య, ఎస్ కే నాగుల్ మీరా,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ 45 వ ఆవిర్భావ వేడుకలు

- పార్టీ జెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్



**జయభేరి, ఏప్రిల్ 6:**

లాల్ గడి మలక్ పేట గ్రామంలో బీజేపీ 45 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బిజెపి 45 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం హర్షణీయం అన్నారు. 45 సంవత్సరాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని బిజెపి పటిష్ట స్థాయికి ఎదిగిందన్నారు. అదేవిధంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి ఎదురులేని పార్టీగా అవతరించిందన్నారు. రాబోవు రోజుల్లో బూతు స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు కొరివి కృష్ణ ముదిరాజ్, రాజిరెడ్డి, నరేందర్ రెడ్డి, మామిండ్ల అశోక్, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పరవాడలో ఘనంగా బిజెపి 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో సంత బయలు వద్ద ఆదివారం పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక నాయకులు కూండ్రపు సోమనాయుడు ఆధ్వర్యంలో బిజెపి జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టాభి ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి నమో బాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముత్యాల అప్పారావు, మండల అధ్యక్షులు పిళ్ళా సతీష్‌పాల్గొని ప్రసంగించారు. పార్టీ జనసంగ్ నుంచి 1980, ఏప్రిల్ 6న శ్యాంప్రసాద్ ముఖర్జీ, దిందయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారి వాజ్‌పేయి, ఎల్కే అద్వాని ఆధ్వర్యంలో బీజేపీగా అవతరించిందన్నారు. అప్పుడు ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ వరుసగా మూడవసారి అధికారంలోకి రావడం జరిగిందనీ, ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి. బోనంగి సర్పంచ్ కల్పన రాజశేఖర్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శిలు బంతికోరు గోవింద్, కురచ సరస్వతి, వైస్ ప్రెసిడెంట్ పి. సత్యారావు, బిజెపి జిల్లా యువమోర్చా కార్యదర్శి మోస రామకృష్ణ, స్థానిక నాయకులు నూకరాజు, సోమశేఖర్, నాగరాజు, అజయ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## పాలవరంలో 17 ఏళ్లుగా నిర్విరామంగా శ్రీరామనవమి వేడుకలు

- ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో కనుల పండుగగా రాములోరి కళ్యాణం
- కళ్యాణ మహోత్సవానికి పోటెత్తిన జనం
- కళ్యాణాన్ని తిలకించి తరించిపోయిన భక్తజనం
- ఘనంగా భక్తులకు అన్నదానం
- సహకరించిన గ్రామ పెద్దలు,యువకులు



**జయభేరి, కోదాడ :**

అనంతగిరి మండల పరిధిలోని పాలవరం గ్రామంలో గల అంకుమాంబ ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆదివారం ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో,భక్తజన సందోహం లో కన్నుల పండుగగా నిర్వహించారు.సీతారాములోరిని పల్లకిలో డీజే చప్పుల్లు,కోలాటాల కోలాహలం మధ్య స్టేజ్ మీదకు తీసుకొచ్చారు.కళ్యాణాన్ని తిలకించడానికి గ్రామంలోని భక్తులు పోటెత్తారు.వేద పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించి ధన్యులయ్యారు.గత 17 ఏళ్లుగా నిర్విరామంగా కానీ విని ఎరుగని రీతిలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.కళ్యాణం అనంతరం భక్తులకు దాతల సహకారంతో కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,మహిళలు ,యువకులు పాల్గొన్నారు.

## అలియాబాద్ లో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- పార్టీ జెండాను ఆవిష్కరించిన పార్టీ నేతలు

**జయభేరి, ఏప్రిల్ 6:**

శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామంలో బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పలువురు బిజెపి నేతలు హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 45 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ బలోపేతం అవుతుందని వారు వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఉమ్మడి శామీర్ పేట మండలంలో కూడా బిజెపి పటిష్టంగా ఉందని తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల మాజీ వైస్ ఎంపీపీ బిజెపి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు వంగరి హృదయ కుమార్, ఒబిసి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అల్లం శ్రీనివాస్, కిషన్ మోర్చా జిల్లా మాజీ కార్యవర్గ సభ్యులు మల్యాల మహేష్, బిజెపి చేనేత సెల్ కో కన్వీనర్ నారా నిరంజన్ బాబు, ఓబిసి మోర్చా మండల మాజీ అధ్యక్షులు కొంగ బాలకృష్ణ, బిజెపి సీనియర్ నాయకులు తుమ్మ వివేకానంద, గౌరారం రమేష్, గట్టు హరిశంకర్, ఇప్ప బ్రహ్మానంద రెడ్డి, రమేష్, కందుల శ్రీనివాస్, చిర్ల సంజీవ, ఎనమైన కృష్ణ, సిహెచ్ వెంకటేష్, శివ, వల్లపు రాంబాబు, శ్రీకాంత్, యాట కేశవ్, బూత్ అధ్యక్షులు చిటికుల సత్యం, మంచినీళ్ల రాకేష్, ఏనమైన సంతోష్ కుమార్, మేడ బోయిన యాదగిరి, మంత్రి సునీల్ ఎలా బాబు రాజ్ బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైజయంతితో వారసుడు

నందమూరి కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. విజయశాంతి శక్తిమంతమైన పోలీస్ పాత్రలో నటించారు. శ్రీకాంత్, సాయిమంజ్రేకర్, సోహైల్ ఖాన్ కీలక పాత్రలు పోషించారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో విజయశాంతి ముందు కుర్చీలో కూర్చున్న కల్యాణ్‌రామ్.. విలన్ గ్యాంగ్ పనిపడుతూ కనిపించారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

# నిర్మాత మాటల్ని తప్పుపడుతున్న నెటిజన్స్



బాలీవుడ్‌లో కథానాయిక శ్రద్ధాకపూర్ ఇటీవల 'స్త్రీ 2'తో హిట్ అందుకున్నారు. ఈ సినిమాలో ఆమెను కథానాయికగా ఎంచుకోవడంపై దర్శకుడు అమర్ కౌశిక్ స్పందించారు. 'స్త్రీ' సినిమా ప్లాన్ చేశాక కథానాయికగా ఎవరిని తీసుకుంటే బాగుంటుందా? అని మేము ఎంతగానో ఆలోచించాం. అలాంటి సమయంలో శ్రద్ధా కపూర్ పేరును ప్రతిపాదించారు నిర్మాత దినేశ్ విజయ్. కాబట్టి ఆ క్రెడిట్ పూర్తిగా ఆయనకే దక్కుతుంది. ఆ పాత్ర కోసం ఆమెను ఎంచుకోవడానికి గల కారణాన్ని కూడా నాతో చెప్పారు. ఓసారి శ్రద్ధాకపూర్, దినేశ్ ఒకే ఫ్లైట్‌లో ప్రయాణించారు. చాలా సేపు సరదాగా మాట్లాడుకున్నారట. ఆమె అచ్చం దెయ్యంలా నవ్వుతుందని.. అందువల్ల ఈ పాత్రకు తను అయితే పూర్తి న్యాయం చేయగలదని ఆయన నాతో చెప్పారు'' అని అమర్ కౌశిక్ అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. నిర్మాత తీరును శ్రద్ధా కపూర్ అభిమానులు తప్పుపడుతున్నారు. ఆమెను హీరోయిన్‌గా పెట్టి మీరు డబ్బులు సంపాదించుకుని ఈ విధంగా మాట్లాడటం ఏమీ బాగోలేదని కామెంట్స్ చేస్తున్నారు.



# పరుగు మూవీ హీరోయిన్..

టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంతో మంది హీరోయిన్స్ వస్తుంటారు. అందులో కొందరు తారలు మాత్రమే తక్కువ సమయంలో క్రేజ్ సొంతం చేసుకుంటారు. తెలుగులో యంగ్ హీరోస్ సరసన ఛాన్స్ కొట్టేసి తక్కువ సినిమాలు చేసినప్పటికీ అడియన్స్ హృదయాల్లో చోటు సంపాదించుకుంటారు. అలాంటి వారిలో షీలా కౌర్ ఒకరు. ఈ బ్యూటీ పేరు చెబితే గుర్తుపట్టడం కష్టమే. కానీ స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పరుగు మూవీ హీరోయిన్ అంటే మాత్రం ఠక్కున గుర్తుపట్టేస్తారు. ఈ సినిమాతోనే తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యింది ఈ ముద్దుగుమ్మ. అంతకు ముందు చైల్డ్ ఆర్టిస్టుగా దాదాపు 20 సినిమాల్లో కనిపించింది. టాలీవుడ్ హీరో నవదీప్ నటించిన సీతాకోక చిలుక సినిమాతో కథానాయికగా వెండితెరకు పరిచయమైంది. ఫస్ట్ మూవీతోనే అందం, అభినయంతో ఆకట్టుకుంది. ఆ తర్వాత రామ్ పోతినేని సరసన మస్కా సినిమాలో మెరిసింది. ఇక అల్లు అర్జున్ నటించిన పరుగు చిత్రంతో సూపర్ హిట్ అందుకుంది. ఈ చిత్రంలో అమాయకంగా కనిపిస్తూనే తనదైన నటనతో, అందంతో కుర్రకారులను ఆకర్షించింది. ఆ తర్వాత తెలుగులో రాజు భాయ్, హలో ప్రేమిస్తారా, అదుర్స్ వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుస సినిమాల్లో నటిస్తున్న షీలాకు నెమ్మదిగా ఆఫర్స్ తగ్గిపోయాయి. ఆమె చివరిసారిగా 2011లో బాలకృష్ణ నటించిన పరమవీరచక్ర సినిమాలో నటించింది. ఆ తర్వాత వెండితెరపై కనిపించలేదు. 2020లో ప్రముఖ వ్యాపారవేత్త సంతోష్ రెడ్డిని వివాహం చేసుకుంది. ఈ దంపతులకు ఒక పాప జన్మించింది. ప్రస్తుతం తన భర్తతో కలిసి సూపర్ మార్కెట్ బిజినెస్ లో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఇటు సోషల్ మీడియాలోనూ షీలా చాలా యాక్టివ్. తాజాగా ఈ అమ్మడు లేటెస్ట్ ఫోటోస్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్.

# బ్లూకలర్ లెహెంగాలో రష్మీ..

జబర్దస్త్ లో యాంకరింగ్ చేస్తూ తన కంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది రష్మి. ఈ ముద్దుగుమ్మ అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన గ్లామర్‌తో మాయ చేస్తుంది. బుల్లితెరపై ఎన్నో షోలు చేస్తూ మంచి పాపులారిటీ సంపాదించుకున్న ఈ బ్యూటీ, ముఖ్యంగా సుధీర్‌తో జోడిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక జబర్దస్త్ ద్వారా ఫేమ్ సంపాదించిన చాలా మంది షోను వదిలేసి సినిమాలకే టైమ్ కేటాయించారు. కానీ ఈ ముద్దుగుమ్మ మాత్రం జబర్దస్త్‌లో కొనసాగుతూనే సినిమాల్లో కూడా నటించింది. చాలా సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా, హీరోయిన్ గా కూడా చేసి తన నటనతో మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. ఇక ఎప్పుడూ సోషల్ మీడయాలో యాక్టివ్ గా ఉంటే ఈ చిన్నది తన లేటెస్ట్ బ్యూటిఫుల్, గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తుంటుంది. అంతే కాకుండా అభిమానులతో ముచ్చటిస్తూ, తన స్టైలిష్ ఫోటోలను షేర్ చేసి వారిని తన వైపుకు తిప్పుకుంటుంది. తాజాగా ఈ చిన్నది ట్రెడిషనల్ లుక్ లో మెరిసిపోయింది. చూడటానికి చాలా సింపుల్ గా కనిపిస్తూ తన అందాలతో మాయ చేస్తుంది ఈ బ్యూటీ. ఈ ఫొటోలో రష్మీ అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. మరి మీరు కూడా ఈ ఫొటోస్ పై ఓ లుక్ వేయండి.







# అఖిల్‌కి పెళ్లి కళ వచ్చేసినట్టేనా..

అక్కినేని మూడో తరం వారసుడు అఖిల్ సినిమాల సంగతేమో కాని పెళ్లి వార్తలతో వార్తలలో వస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం జైనబ్ రవ్జీతో నిశ్చితార్థం జరుపుకున్నారు. అయితే పెళ్లి ఎప్పుడు జరుగుతుందా అని అందరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుండగా, దానిపై మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు. వీలైనంత తొందరలనే ఈ జంట పెళ్లి పీటలు ఎక్కనున్నట్టు తెలుస్తుంది. అయితే రీసెంట్‌గా అఖిల్, జైనాబ్ ఇద్దరూ జంటగా హైదరాబాద్ విమానాశ్రయంలో కనిపించారు. ఎయిర్ పోర్టులో ఒకరి చేయి ఒకరు పట్టుకుని నడుచుకుంటూ వెళుతున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. వీరిని ఇలా చూసిన నెటిజన్స్ పెళ్లి కళ వచ్చేసింది అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఈ జంట చాలా చూడముచ్చటగా ఉందని, పెళ్లి పనులలో వారు బిజీగా ఉన్నారేమో అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు కాబోయే భార్యతో కలిసి బర్త్ డే సెలబ్రేషన్స్ కోసం టూర్ వేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నెల 8న అఖిల్ పుట్టినరోజు కావడంతో స్పెషల్‌గా పుట్టినరోజు వేడుకలు జరుపుకొనేందుకే ఇద్దరు మంచి ప్లేస్‌కి వెళుతున్నారేమో అని, ఇదే అఖిల్ లాస్ట్ బ్యాచిలర్ బర్త్ డే పార్టీ అవుతుందేమో అని క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

గతంలో అఖిల్ ఓ అమ్మాయితో నిశ్చితార్థం జరుపుకున్న విషయం తెలిసిందే. తనని పెళ్లి చేసుకుంటాడు అనుకునే లోపు వారిద్దరు బ్రేకప్ చెప్పుకున్నారు. ఇక అఖిల్ చివరిసారిగా ఏజెంట్ చిత్రంతో ఆడియన్స్‌ని అలరించాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఇక అఖిల్ కొత్త ప్రాజెక్ట్ ఏంటనేది ఇప్పటి వరకు తెలియజేయలేదు. అయితే అఖిల్ బర్త్ డే సందర్భంగా 'Akhil 6' అప్ డేట్ రానుందని పోస్ట్ పెట్టారు నిర్మాత నాగవంశీ. 'వినరో భాగ్యము విష్ణుకథ' ఫేమ్ మురళీ కిషోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. అఖిల్ బర్త్ డే సందర్భంగా ఈ నెల 8న అధికారిక ప్రకటన రాబోతోంది. అదే రోజున ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి 'లెనిన్' అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. గ్రామీణ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రూపొందనుందని సమాచారం. ఇందులో శ్రీలీల కథానాయిక అని అంటున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com